సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025




### ఆరుబయట చదువులు

బిచ్కుంద జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో విద్యార్థులు ఆరుబయట కూర్చొని చదువుకోవాల్సి వస్తోంది.

- 8లో ▸



### పోషకాహారం తీసుకోవాలి

జిల్లాలో గురువారం పోషణ్ మాసోత్సవం నిర్వహించారు. మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని అధికారులు సూచించారు.

- 8లో ▸

### వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.9 /21.3

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ ఎక్కువగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

## న్యూస్‌రీల్

### 'రైతులకు ఇబ్బంది కలగనీయొద్దు'



గాంధారి: రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా పంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన ఏవో రాజలింగంతో కలిసి మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయాన్ని సందర్శించారు. సొసైటీకి వచ్చిన 444 యూరియా బస్తాలను దగ్గరుండి రైతులకు పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ సరిపడా యూరియా సరఫరా చేస్తామని, రైతులు ఆందోళన చెందరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో విండో సీఈవో సాయిలు, ఏఈవోలు విఘ్నేష్, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

### పీజీలో 81 శాతం ఉత్తీర్ణత



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (స్వయంప్రతిపత్తి) పీజీ ప్రథమ సంవత్సరం రెండో సెమిస్టర్ ఫలితాలు గురువారం వెల్లడయ్యాయి. తెలంగాణ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి సంపత్‌కుమార్, వైస్‌ప్రిన్సిపల్ కిష్టయ్య ఫలితాలను విడుదల చేశారు. పరీక్షల్లో 81 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని వారు తెలిపారు. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు రాజేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

### 'నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలి'



కామారెడ్డి టౌన్: విద్యార్థులు నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో జరిగిన స్కిల్ ప్లస్ కార్యక్రమంలో లార్వెన్ ఏఐ స్టూడియో ఫౌండర్ దిల్ రాజు బృందం సందడి చేసింది. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ సినీ రంగంపై ఆసక్తి ఉండి అటువైపు అడుగులు వేయాలనుకుంటున్న విద్యార్థులకు లార్వెన్ ఏఐ స్టూడియో ద్వారా ఏఐ, వీఎఫ్‌ఎక్స్‌లలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిగ్రీతో పాటు వివిధ మల్టీ నేషనల్ కంపెనీలలో ఉద్యోగాలను పొందిన కళాశాల విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో దిల్ రాజు సతీమణి లార్వెన్ కోఫౌండర్ వైగా రెడ్డి, ఆయా కంపెనీల సీఈవోలు రక్షిత్ రెడ్డి, మనీష్, సాయి కిరణ్, దేశ్‌పాండే ఫౌండేషన్ ప్రతినిధులు శేఖర్, శ్రీకాంత్, సాందీపని కళాశాల డైరెక్టర్ హరిస్మరణ్‌రెడ్డి, ప్రిన్సిపల్ సాయిబాబు పాల్గొన్నారు.

### కామారెడ్డి ఆర్టీసీ డీఎంగా దినేశ్ కుమార్

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పి.దినేశ్ కుమార్ నియమితులయ్యారు. గతంలో ఇక్కడ డీఎంగా పనిచేసిన కరుణశ్రీ హైదరాబాద్–2 డిపోకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో ప్రస్తుతం ఖమ్మం డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న దినేశ్ కుమార్ బదిలీపై వస్తున్నారు. ఆయన ఈనెల 22న విధుల్లో చేరనున్నారు. దినేశ్ కుమార్ గతంలో ఇక్కడే ఆర్టీసీ సీఐగా విధులు నిర్వహించారు.

సాగునీటి కష్టాలను తీర్చే మంజీర నది.. పరీవాహక ప్రాంతాలను మాత్రం ముంచేస్తోంది. భారీ వరదలతో రోజుల తరబడి నీరు నిల్వ ఉంటుండడంతో పంటలు మురిగిపోతున్నాయి. దీంతో అన్నదాతలు నష్టాల పాలవుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



వెంకంపల్లి శివారులో మంజీర నీటిలో మునిగి దెబ్బతిన్న పంట

# మంజీర ముంచేస్తోంది!

- ఏటా భారీ వరదలతో నీట మునుగుతున్న వేలాది ఎకరాలు
- రోజుల తరబడి నీరు నిలుస్తుండడంతో దెబ్బతింటున్న పంటలు
- నష్టపోతున్న రైతులు
- నదికిరువైపులా కరకట్టలు నిర్మించాలంటున్న అన్నదాతలు



బంజర శివారులో మంజీర వరద నీటిలో మునిగిన పంట

దశాబ్దాల కాలంగా మంజీర తీరంలో ముంపు సమస్యను రైతాంగం ఎదుర్కొంటోంది. నదికి వరద పోటెత్తినపుడల్లా పరీవాహక ప్రాంతంలో వేలాది ఎకరాల పంటలు నీట మునుగుతున్నాయి. ప్రధానంగా జిల్లాలోని నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, నిజాంసాగర్, మహ్మద్‌నగర్, పిట్లం, బిచ్కుంద తదితర మండలాలను ముంపు సమస్య వెన్నాడుతోంది. ఎగువన భారీ వర్షాలు కురిసి సింగూరు గేట్లు ఎత్తినపుడు, అలాగే పోచారం ప్రాజెక్టు పొంగినపుడు మంజీరలో వరద పోటెత్తి పరీవాహక ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. గత నెల 26, 27, 28 తేదీలలో కురిసిన భారీ వర్షంతో పోచారం ప్రాజెక్టు ఎన్నడూ లేనంతగా పొంగింది. ప్రాజెక్టు కట్టపై నుంచి నీరు వెళ్లి కట్ట కోతకు గురవగా.. ఓ దశలో ప్రాజెక్టు కొట్టుకుపోతుందనే ఆందోళన వ్యక్తమైంది. గతంలో ఎన్నడూ రానంత వరద రావడంతో మంజీర పరవళ్లు తొక్కింది. దీంతో నాగిరెడ్డిపేట మండలంలోని గోలిలింగాల, మాల్తుమ్మెద, చీనూర్, వాడి, నాగిరెడ్డిపేట, లింగంపల్లి, వెంకంపల్లి, తాండూర్, మాటూర్, మాసన్‌పల్లి, ఆత్మకూర్, జలాల్‌పూర్ గ్రామాలతో పాటు ఎల్లారెడ్డి మండలంలోని పలు గ్రామాలకు చెందిన పంట చేలు నీట మునిగాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తినా, ఎగువ నుంచి ప్రవాహం ఎక్కువగా ఉండడం, నిజాంసాగర్ ప్రాజెక్టు వెనుకభాగంలో నీరు తన్నడంతో ఆయా గ్రామాల పరిధిలోకి నీరు చొచ్చుకువచ్చింది. పొలాలు నీటమునిగాయి. తరువాత సింగూరు గేట్లు ఎత్తడంతో దాదాపు పది రోజుల పాటు నీరంతా చేలల్లోనే నిలిచిపోయింది. దాదాపు ఇరవై రోజులుగా పొలాలు ముంపులోనే ఉన్నాయి. మధ్యలో ఒకటి రెండు రోజులు కొంత బయటపడినా.. తిరిగి నీరు రావడంతో మునిగిపోయి పంట పాడైంది. నిజాంసాగర్ ప్రాజెక్టుకు దిగువన ఉన్న నిజాంసాగర్, మహ్మద్‌నగర్, పిట్లం, బిచ్కుంద మండలాల్లో కూడా ముంపు సమస్య వేధిస్తోంది. అలాగే నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌తోనూ కొన్ని గ్రామాల్లో పంటలు మునిగిపోతున్నాయి. గేట్లు ఎత్తి దిగువకు వదిలినప్పటికీ ఎగువ నుంచి భారీ ప్రవాహం రావడం వల్ల నీరంతా వెనక్కి తన్నుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు.

### ఐదు వేల ఎకరాలకుపైనే..

నాగిరెడ్డిపేట మండలంలో 12 గ్రామాల పరిధిలో దాదాపు మూడు వేల ఎకరాల్లో పంటలు మంజీరలో మునుగుతాయి. అలాగే ఎల్లారెడ్డి, పిట్లం, మహ్మద్‌నగర్, నిజాంసాగర్, బిచ్కుంద మండలాల పరిధిలో దాదాపు రెండు వేల ఎకరాల్లో పంటలు నీట మునుగుతున్నట్లు అంచనా. మొత్తంగా ఐదు వేల ఎకరాలకుపైగా పొలాలు మంజీర ప్రవాహంలో మునుగుతున్నాయని స్పష్టమవుతోంది. నాలుగైదు రోజులు నీరు నిలిస్తే పెద్దగా నష్టం ఉండదని, కానీ పక్షం రోజులపైనే నీరు నిలుస్తుండడంతో పంటంతా మురిగిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కరకట్టే పరిష్కారం!

మంజీర ప్రవాహం ఎక్కువగా ఉన్నపుడల్లా నీరంతా ఇరువైపులా ముంచెత్తుతోంది. చాలాచోట్ల పొలాల్లోకి వరద నీరు చేరి పంటను ముంచేస్తోంది. కొన్నిచోట్ల నీరు ఊళ్లను కూడా చుట్టేస్తోంది. ఈ సమస్య పరిష్కారం కావాలంటే మంజీరకు ఇరువైపులా అక్కడక్కడ కరకట్టలు నిర్మించాలని రైతులు సూచిస్తున్నారు. మంజీర వరద ఎక్కువగా వచ్చినపుడు వెనక్కి తన్ని నీటి ప్రవాహం కిలోమీటర్ల మేర నిలుస్తోంది. నాగిరెడ్డిపేట మండలం బంజర సమీపంలో జాతీయ రహదారినీ తాకుతోంది. అక్కడికి మంజీర చాలా దూరంలో ఉంటుంది. మంజీరకు కరకట్టలు నిర్మించి ఇబ్బందులు తొలగించాలని రైతులు వేడుకుంటున్నారు.

### పెట్టుబడి మీదపడ్డది..



మూడు ఎకరాల్లో వరి పంట వేసిన. మంజీర వరద ఎక్కువగా వచ్చి పొలమంతా మునిగింది. వారం రోజులకు నీరు పోయిందనుకునేలోపు మరోసారి సింగూరు నుంచి నీరు వదలడంతో మళ్లీ మునిగింది. దీంతో పంట మొత్తం కుళ్లిపోయి నాశనమైంది. పెట్టిన పెట్టుబడి మొత్తం మునగాల్సి వచ్చింది.

– నగేశ్, రైతు, నాగిరెడ్డిపేట

### పదెకరాల్లో నష్టం..



నాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. దానికి తోడు ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని పంట సాగు చేసిన. దాదాపు రూ.3 లక్షలు ఖర్చు చేసిన. ఇటీవల వర్షాలతో మంజీర నది ఉప్పొంగి ప్రవహించడంతో పంటంతా నీట మునిగి కుళ్లిపోయింది. ఏటా ఇబ్బందులు పడుతున్నాం. ముంపు సమస్యను పరిష్కరించాలి.

– పరిశోధన్‌రెడ్డి, వెంకంపల్లి, నాగిరెడ్డిపేట మండలం

### ఏటా ఇదే పరిస్థితి..



నిజాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో మా ఊరిలో చాలా మంది పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ఈసారి పదిహేను రోజులుగా నీటిలోనే పంట ఉండడంతో దెబ్బతిన్నది. నాది ఎకరం పొలం పాడైంది. ఏటా ఇదే పరిస్థితి ఎదురవుతోంది. ప్రభుత్వం స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– బోద జాను, రైతు, రుద్రారం, ఎల్లారెడ్డి మండలం

### దేశాభివృద్ధిలో యూనివర్సిటీలది కీలకపాత్ర

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చక్రపాణి



భిక్కనూరు: దేశాభివృద్ధిలో యూనివర్సిటీలు కీలక పాత్ర పోషిస్తాయని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చక్రపాణి పేర్కొన్నారు. మేధావులను తయారు చేసే ఫ్యాక్టరీలుగా యూనివర్సిటీలు నిలుస్తున్నాయన్నారు. గురువారం ఆయన భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీల్లో నూతన సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించి విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని శాస్త్రవేత్తల సహకారంతో అభివృద్ధి చెందాలని సూచించారు. సాంఘిక మార్పులను విద్యార్థులకు తెలియజేసి, వారిలో మార్పు తీసుకురావాలని, ఆన్‌లైన్ డిజిటల్ కామర్స్‌ను వినియోగించుకుంటూ గ్రామీణ ప్రాంతాల్లో తయారైన వస్తువులను సైతం ప్రపంచానికి పరిచయం చేయవచ్చని పేర్కొన్నారు. విద్యతో పాటు ఇంటర్న్‌షిప్ కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు చక్రపాణిని సత్కరించారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, అధ్యాపకులు యాలాద్రి, వైశాలి, సరిత, అంజయ్య, మోహన్, నారాయణ, ప్రతిజ్ఞ, నాగరాజు, నిరంజన్, శ్రీకాంత్, దిలీప్, శ్రీమాత పాల్గొన్నారు.

### 'చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి'



దోమకొండ: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీఈవో రాజు, ఏఎస్పీ చైతన్యరెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని గడికోటలో గడికోట ట్రస్టు ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడలు నిర్వహించారు. విజేతలకు డీఈవో, ఏఎస్పీ బహుమతులు అందించారు. క్రీడలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడతాయని పేర్కొన్నారు. అదేవిధంగా జీవితంలో క్రమశిక్షణ, స్ఫూర్తిని పెంపొందిస్తాయన్నారు. మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి, ఒత్తిడిని తగ్గించడానికి క్రీడలు దోహదపడతాయన్నారు. గెలుపు ఓటములు సహజమని, ఓడిన వారు గెలుపు కోసం ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో భిక్కనూరు సీఐ సంపత్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, మాజీ జెడ్పీటీసీ తీగల తిరుమలగౌడ్, ట్రస్టు మేనేజర్ బాల్జీ, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

## నష్టాల నుంచి లాభాల్లోకి తీసుకురావాలి



డీసీసీబీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న చైర్మన్ రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నష్టాల్లో ఉన్న డీసీసీబీ శాఖలను లాభాల్లోకి తీసుకొచ్చేలా కృషి చేయాలని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ నగరంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో గురువారం ఆయా బ్రాంచీల అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. బ్యాంకు వ్యాపార కార్యకలాపాలు రూ.2400 కోట్ల మైలురాయిని చేరుకున్న సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రూ.2400 కోట్లలో రూ.787 కోట్లు డిపాజిట్లు, రూ.1613 కోట్లు రుణాలు ఉన్నాయని వివరించారు. ప్రతి ఉద్యోగి లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిబద్ధతతో పని చేయడంతో ఈ ఘనత సాధ్యమైందన్నారు. నష్టాల్లో ఉన్న శాఖలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ క్షేత్రస్థాయిలో శాఖాధికారులకు దిశానిర్దేశం చేస్తున్న సీఈవో నాగభూషణం వందే, ఇతర ఉన్నతాధికారులను చైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు. వేతన సవరణకు సంబంధించి మొదటి విడత ఏరియర్స్ తమ ఖాతాల్లో జమ చేసినందుకు ఉద్యోగులు చైర్మన్‌తోపాటు పాలకవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. డీజీఎంలు లింబాద్రి, అనుపమ, సుమమాల, గజానంద్, ఉన్నతాధికారులు, 63 బ్రాంచీల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసుక మేటల తొలగింపును వేగవంతం చేయాలి

- వరద ప్రభావిత వ్యవసాయ భూములను సాగుకు యోగ్యంగా మారుస్తాం
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



బూరుగిద్ద శివారులో ఏర్పడిన ఇసుక మేటలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు చూపుతున్న రైతు

లింగంపేట(ఎల్లారెడ్డి): భారీ వర్షాల కారణంగా వ్యవసాయ భూముల్లో ఏర్పడిన ఇసుక మేటలను తొలగించి తిరిగి సాగుకు యోగ్యంగా మారుస్తామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. లింగంపేట మండలం బూరుగిద్ద శివారులో ఊరకుంట తెగిపోవడంతో పొలాల్లో ఏర్పడిన ఇసుక మేటలను కలెక్టర్ గురువారం పరిశీలించారు. వరద బాధిత రైతులైన సబావత్ లక్ష్మి, చంద్రకళ, స్వరూప, మానస, పోచయ్య, బాలకిషన్‌తోపాటు అధికారులతో మాట్లాడారు. ఇసుక మేటలను వేగంగా తొలగింపజేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధిహామీ కూలీలతో ఇసుక మేటలు, మొరం దిబ్బలు తొలగించి భూములను తిరిగి సాగు యోగ్యంగా మార్చాలన్నారు. మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 287 ఎకరాల్లో ఇసుక మేటలు వేసినట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లో ఇసుక మేటల కొలతలు తీసి పూర్తి స్థాయిలో తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇసుక మేటల నుంచి వచ్చిన ఇసుకను ఇందిరమ్మ ఇళ్లకు, ప్రభుత్వ నిర్మాణాలకు ఉపయోగించాలని ఎంపీడీవో నరేశ్‌కు, ఇసుక మేటల తొలగింపును ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని డీఆర్డీవో సురేందర్‌కు సూచించారు. మళ్లీ భారీ వర్షాలు కురిస్తే ఇసుక మేటలు ఏర్పడకుండా చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. పంట నష్టం వివరాలను పూర్తి స్థాయిలో సేకరించాలని వ్యవసాయాధికారులకు సూచించారు.

**యుద్ధప్రాతిపదికన చెరువులకు మరమ్మతులు**

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తెగిపోయిన చెరువుల కట్టలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తెగిపోయిన ఊరకుంట, సోమ్లానాయక్ చెరువు, కొండెంగల చెరువు, మల్లారం పెద్ద చెరువుతోపాటు జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న చెరువులకు మరమ్మతులు చేయాలని సూచించారు. ప్రతి రోజు ఇరిగేషన్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి, రెవెన్యూ, ఇరిగేషన్, జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు ఉన్నారు.

## పక్షం రోజుల్లో హెల్త్‌కార్డులు

- పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పుల్గం దామోదర్‌రెడ్డి





మాట్లాడుతున్న పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి

కామారెడ్డి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పదిహేను రోజుల్లో హెల్త్‌కార్డులు అందనున్నాయని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పుల్గం దామోదర్‌రెడ్డి తెలిపారు. వాటితో కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత చికిత్సలు పొందవచ్చన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆయన తొలిసారి గురువారం కామారెడ్డికి వచ్చారు. కామారెడ్డిలోని పీఆర్టీయూ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. గురుకుల, కేజీబీవీ, ఆదర్శ, ఇతర గురుకుల విద్యాలయాల ఉపాధ్యాయులకూ నగదు రహిత చికిత్సల కోసం ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. మరో 15 రోజుల్లో నాలుగు వేల మంది ఉపాధ్యాయులకు ప్రమోషన్లు రానున్నాయన్నారు. గురుకుల పాఠశాలల పనివేళలు మార్పు చేయాలని తాము చేసిన విజ్ఞప్తి మేరకు ఉదయం 9 గంటలకు మార్పు చేశారని తెలిపారు. 20 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు, 398 స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. తనకు పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యే అవకాశం కల్పించిన కామారెడ్డి జిల్లా ఉపాధ్యాయులకు రుణపడి ఉంటానని దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గర్దాస్ గోవర్ధన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లాపూర్ కుషాల్, పుట్ట శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వీరేందర్‌గౌడ్, ప్రేమ్‌గిరి, బసంత్‌రాజ్, రాజిరెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాసాచారి, రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారం తీసుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

లింగంపేట: శారీరక, మానసిక దృఢత్వానికి పౌష్టికాహారం తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గురువారం పోతాయిపల్లి హైస్కూల్‌లో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా, పోషణ్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వచ్ఛతపై విద్యార్థులు ఏర్పాటు చేసిన మానవహారంలో పాల్గొని స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలను శుభ్రపరచడం, పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేయించడం, ప్లాస్టిక్ వ్యర్థాలతో ఆకర్షణీయమైన వస్తువులు తయారు చేయడం లాంటి కార్యక్రమాలను నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో స్టోర్ రూం, వంటగదిని పరిశీలించారు. చిన్నారులతో ముచ్చటించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పేయింటింగ్ వేయించాలని ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, డీఆర్డీవో సురేందర్, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, జిల్లా బాలల సంరక్షణ అధికారి స్రవంతి, ఎంపీడీవో నరేష్, తహసీల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### జాగ్రత్తలు పాటించాలి

కామారెడ్డి క్రైం: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా జిల్లాలోని అన్ని నీటి వనరులు పూర్తిస్థాయిలో నిండి ఉన్నాయని, చిన్న వర్షం కురిసినా లోలెవల్ కల్వర్టులు, బ్రిడ్జీలపైనుంచి వర్షం నీరు ప్రవహిస్తున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ఈ విషయమై ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈత కొట్టడానికి, చేపలు పట్టడానికి నీటి వనరుల వద్దకు వెళ్లవద్దని పేర్కొన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలు ప్రమాదకరమైన నీటి వనరులు ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు కురిసే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉన్నందున ఎత్తయిన టవర్లు, విద్యుత్ స్తంభాలు, చెట్ల కిందికి వెళ్లవద్దని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు దూరంగా ఉండాలని, బహిరంగ ప్రదేశంలో ఉంటే తక్కువ ఎత్తులో నేలపై వంగి కూర్చోవాలని సూచించారు.

## క్లుప్తంగా

### బాలాజీ జెండాకు భక్తుల వీడ్కోలు

- వైభవంగా బాలాజీ జెండా ఊరేగింపు



**మద్నూర్(జుక్కల్):** మండల కేంద్రంలో 11 రోజులుగా పూజలందుకున్న తిరుమల తిరుపతి శ్రీవారి బాలాజీ జెండాకు గురువారం భక్తులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. భక్తులు జెండాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం బాలాజీ జెండా 11 రోజుల పాటు మద్నూర్‌లో పూజలందుకున్న అనంతరం తిరుమలకు తరలివెళ్తుందన్నారు. జెండా వెంట భక్తులు గ్రామ పొలిమేర వరకు భజనలు చేస్తూ వెళ్లారు.

### జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



**బాన్సువాడ:** బోర్లం క్యాంపులో నిర్వహించే జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం డీఎస్పీ విఠల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో వాలీబాల్ టోర్నీ కొనసాగుతుందని, జిల్లాలోని వివిధ మండలాల క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు ధరావత్ రవి తెలిపారు. మొదటి బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేల నగదుతో పాటు మెమెంటోలు అందజేస్తామని వారు తెలిపారు.

### డీజేలకు అనుమతి లేదు

- ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు



**ఎల్లారెడ్డి:** దేవి నవరాత్రి ఉత్సవాలకు డీజేలకు అనుమతి లేదని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట, గాంధారి మండలాల దేవి మండప నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. దుర్గామాత నవరాత్రులు ప్రారంభమవుతున్న దృష్ట్యా పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని నిర్వాహకులకు సూచించారు. మండపాల ఏర్పాటుకు సంబంధించిన వివరాలను పోలీసులకు అందించాలని సూచించారు. సీఐ రాజారెడ్డి, ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట, గాంధారి మండలాల ఎస్సైలు దీపక్ కుమార్, ఆంజనేయులు, భార్గవ్‌గౌడ్, సుబ్రహ్మణ్యచారి, దేవి మండప నిర్వాహకులు, శాంతి కమిటీ సభ్యులు సాయిబాబా, రాములు తదితరులున్నారు.

# ఆరుబయట చదువులు

- శిథిలావస్థకు చేరిన జూనియర్ కళాశాల
- నీరు ఊరుస్తున్న గదులు
- బురద నేలపై కూర్చుని పాఠాలు వింటున్న విద్యార్థులు
- రూ.43 లక్షలు నిధులున్నా జరగని మరమ్మతులు



శిథిలావస్థలో ఉన్న తరగతి గది



బిచ్కుంద ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నేలపై కూర్చొని పాఠాలు వింటున్న విద్యార్థులు

**బిచ్కుంద(జుక్కల్):** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆలనాపాలన చూసేవారు కరువయ్యారు. కళాశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలిపోయే పరిస్థితికి వచ్చింది. 12 గదులలో 6 తరగతి గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులు ఊడిపోయి గోడలు, స్లాబ్‌ల నుంచి నీరు ఊరుతున్నాయి. ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో లెక్చరర్లు కళాశాల ఆవరణలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియం కళాశాల కొనసాగుతున్నాయి. తెలుగు, ఇంగ్లిష్ మీడియం ప్రథమ సంవత్సరంలో 272 మంది విద్యార్థులు, సెకండియర్‌లో 239 మంది విద్యార్థులు.. 11 మంది లెక్చరర్లు ఉన్నారు. అలాగే ఉర్దూ మీడియం ప్రథమ సంవత్సరంలో 45 మంది, సెకండియర్‌లో 55 మంది విద్యార్థులు, 9 మంది లెక్చరర్లు ఉన్నారు. మూడు రకాల మీడియం తరగతులలో మొత్తం 611 మంది విద్యార్థులు, 20 మంది లెక్చరర్లు ఉన్నారు. శిథిలావస్థలో ఉన్న గదులలో విద్యార్థులను కూర్చోపెట్టవద్దని ప్రిన్సిపాల్‌ను జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో ఆవరణలో పాఠాలు బోధిస్తున్నారు. 611 మంది విద్యార్థులకు 6 తరగతి గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ల్యాబ్ సౌకర్యం లేదు.

**నిధులున్నా అమ్మ ఆదర్శ కమిటీతో కాలయాపన..**

గదుల మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.43 లక్షలు మంజూరు చేసింది. అధికారులు ఖాతాలో అలాగే మురుగుతున్నాయి. అమ్మ ఆదర్శ కమిటీ వేయాలని పైఅధికారులు ఆదేశాలిచ్చారు. కమిటీ పేరుతో కాలయాపన జరుగుతుంది. నిధులు మంజూరై నెలల గడుస్తున్నా ప్రయోజనం లేదు. తూతు మంత్రంగా మరమ్మతులు చేసి అధికారులు చేతులు దులుపుకోవద్దని.. వాటిని కూలగొట్టి కొత్త గదులు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు. కలెక్టర్, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్త గదులు, ల్యాబ్ మంజూరు చేయించాలని కోరుతున్నారు.

### 56 ఏళ్ల కళాశాల నిర్మాణం..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మొట్టమొదటి సారిగా 1969లో బిచ్కుందలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటైంది. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ఆనాడు విద్యాశాఖ మంత్రిగా ఉన్నారు. ఆయన చేతుల మీదుగా కళాశాల ప్రారంభించారు. ప్రారంభమై నేటికి 56 ఏళ్లు అవుతుంది. ఆనాడు కరీంనగర్, మెదక్, నిజామాబాద్ నుంచి విద్యార్థులు కళాశాలలో చేరి చదువుకున్నారు. ఎంతో మంది ఈ కళాశాలలో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించారు. కళాశాల అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### అమ్మ ఆదర్శ కమిటీ వేశాం



మరమ్మతుల కోసం రూ.43 లక్షలు నిధులు మంజూరయ్యాయి. పై అధికారుల ఆదేశాల మేరకు కళాశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ఏర్పాటు చేసి బ్యాంక్ ఖాతా తెరుస్తున్నాం. గదులు లేక ఆవరణలో కూర్చోబెట్టి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నాం. త్వరలోనే గదుల మరమ్మతులు చేపడతాం.

– మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, బిచ్కుంద

# మాటల తూటాలు



- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డిపై పోచారం భాస్కర్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు
- ప్రశాంత్‌రెడ్డి మంత్రిగా ఉండి పూర్తిగా విఫలమయ్యారంటూ విమర్శలు
- వెన్నుపోటుతో డీసీసీబీ పీఠం నుంచి తనను దించారంటూ ఆరోపణలు
- వైఎస్ఆర్ ముఖం చూసి బాజిరెడ్డిని గెలిపించారంటూ ఎద్దేవా..

**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ :** ఉమ్మడి జిల్లాలో మాటల తూటాలతో రాజకీయం గరంగరంగా మారింది. డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి తాజాగా చేసిన ప్రసంగం రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించింది. బాన్సువాడ శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డిపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి చేసిన విమర్శలకు ప్రతిగా భాస్కర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. ఎవరేమిటో తేల్చుకుందామంటూ భాస్కర్‌రెడ్డి సవాళ్లు విసిరాడు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డిని ఉద్దేశించి 'లక్ష్మీపుత్రుడు కాదు.. శని పుత్రుడు' అంటూ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ భాస్కర్‌రెడ్డి విరుచుకుపడ్డారు. జీవన్‌రెడ్డి ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. 2018లో 36 వేల ఓట్ల ఆధిక్యంతో గెలిచిన జీవన్‌రెడ్డిని ప్రజలు గత ఎన్నికల్లో మూడోస్థానానికి నెట్టేశారన్నారు. జీవన్‌రెడ్డీ ఇదీ నీ బతుకు అంటూ వాఖ్యలు చేయడం గమనార్హం. నువ్వు జిల్లా అధ్యక్షుడిగా ఉండి ఎంతమంది ఎమ్మెల్యేలను గెలిపించావు అంటూ ప్రశ్నించారు. జీవన్‌రెడ్డిని ఇంటరాగేట్ చేస్తే అతను చేసిన అసాంఘిక కార్యకలాపాలను కక్కేస్తాడన్నారు. భారీగా డబ్బులు సంపాదించి విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు.

- దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖం చూసి నాడు బాన్సువాడలో ప్రజలు బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించారని భాస్కర్‌రెడ్డి అన్నారు. 2014, 2018 ఎన్నికల్లో బాజిరెడ్డి గోవర్ధన్, షకీల్, ఏనుగు రవీందర్‌రెడ్డిలు కలిసి మంత్రి పదవిపై కన్నేసి పోచారం శ్రీనివాసరెడ్డిని ఓడగొట్టేందుకు కుట్రలు చేశారన్నారు. ఏనుగు రవీందర్‌రెడ్డి ఏ ఎండకాగొడుగు పడుతున్నాడన్నారు.
- వేముల ప్రశాంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లా నుంచి మంత్రిగా ఉండి ఏం సాధించారంటూ ఎద్దేవా చేశారు. ప్రశాంత్ రెడ్డికి నిజామాబాద్ జిల్లాలో ఏ ఒక్క ఎమ్మెల్యే గౌరవం ఇవ్వలేదన్నారు. కామారెడ్డి జిల్లాలోని ఎమ్మెల్యేలు మాత్రమే గౌరవించారన్నారు. గత ఎన్నికల్లో కొద్ది తేడాతో ప్రశాంత్‌రెడ్డి గెలుపొందారన్నారు.

ఒకే పార్టీలో ఉన్నప్పటికీ డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న తనను దించేందుకు చేసిన కుట్రలో భాగస్వామి అయ్యారన్నారు. ప్రశాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డికి పదవి కట్టబెట్టేందుకు తనకు వెన్నుపోటు పొడిచారన్నారు. పోచారం తండ్రిలాంటివారని చెప్పిన ప్రశాంత్‌రెడ్డి, మరి పోచారం కొడుకుకే వెన్నుపోటు పొడవడమేమిటన్నారు. రమేష్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రశాంత్‌రెడ్డి సొంత ఊరు వేల్పూర్ సొసైటీలో అవిశ్వాసం పెట్టే అవకాశం ఉన్నప్పటికీ పెట్టలేదన్నారు. పార్టీకి సైతం వెన్నుపోటు పొడిచారన్నారు. ఇది వాస్తవం కాదా అని భాస్కర్‌రెడ్డి ప్రశ్నించారు. దీనిపై ఏ గుడికి వచ్చి చెప్పమన్నా చెబుతా.. బాల్కొండ నియోజకవర్గానికి రమ్మంటావా.. బాన్సువాడ నియోజకవర్గానికి వస్తావా అంటూ భాస్కర్‌రెడ్డి సవాల్ చేశారు. ఈ విషయమై హరీశ్‌రావు, కేటీఆర్‌కు చెప్పినప్పటికీ పట్టించుకోలేదన్నారు. వర్ని మండలం సిద్దాపూర్ సమావేశంలో పోచారం భాస్కర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్నివర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. రానున్న రోజుల్లో ఈ మాటల యుద్ధం మరింత ముదిరే అవకాశమున్నట్లు రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది.

## 'కృత్రిమ మేధ ఒక శక్తిమంతమైన సాధనం'



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధ్యాపకులు

**కామారెడ్డి అర్బన్:** కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు కృత్రిమ మేధ ఒక శక్తిమంతమైన సాధనమని రిసోర్స్ పర్సన్ డాక్టర్ మల్లికార్జునరావు అన్నారు. కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం 'అప్ స్కిల్లింగ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ స్టూడెంట్స్ ఫర్ టుమారో కెరీర్స్' అంశంపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ కె.కిష్టయ్య, కామర్స్ హెచ్‌వోడీ అంకం జయప్రకాష్, వర్క్‌షాప్ కన్వీనర్ కవిత, సమన్వయకర్త విశ్వప్రసాద్, జి.శ్రీనివాస్ రావు, విజయ్‌కుమార్, మీరాబాయి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**బాన్సువాడ రూరల్:** ఆసక్తి గల రైతులు తెలంగాణ ప్రభుత్వం పునఃప్రారంభించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఫయాజుల్లా తెలిపారు. బ్యాటరీ పంపులు, తైవాన్ పంపులు, రోటవేటర్లు, సీడ్ ఫర్టిలైజర్ డ్రిల్, కల్టివేటర్లు, డిస్క్‌హ్యారో, ఎండీ ప్లవ్, రోటో పడ్లర్, కేజ్‌వీల్స్ తదితర పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే పవర్ వీడర్, బండ్ ఫర్మర్, బ్రష్ కట్టర్, పవర్ టిల్లర్లు, గడ్డి కట్టలు కట్టే యంత్రం తదితర పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీపై అందిస్తామన్నరు. ఆధార్‌కార్డు, పాస్‌బుక్, ఫొటోలతో వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### దసరా ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

**మద్నూర్(జుక్కల్):** మరో మూడు రోజుల్లో దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయా గ్రామాలకు దుర్గామాత విగ్రహాలను మండపాలకు భక్తులు తరలిస్తున్నారు. సరిహద్దులోని దెగ్లూర్, నాందేడ్ పట్టణాల నుంచి భక్తులు అమ్మవారి విగ్రహాలను తీసుకువచ్చారు. సోమవారం నుంచి 9 రోజుల పాటు నిర్వహించే నవరాత్రుల కోసం నిర్వాహకులు గ్రామాల్లో విద్యుత్ దీపాలతో మండపాలను సిద్ధం చేశారు. నవరాత్రుల్లో దేవి వద్ద దాండియా ఆడుతూ సందడి చేయనున్నారు.

### ఆరేపల్లిలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం

**రాజంపేట:** ఆరేపల్లిలో గురువారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులతో కలిసి ఎంపీడీవో శ్రమదానం చేశారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాలకృష్ణ మాట్లాడుతూ.. పాఠశాల పరిసరాలలో పరిశుభ్రత పాటించాలని, అలాగే ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. ఎంపీవో రఘురాం, స్కూల్ హెచ్‌ఎం నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఒకే పోర్టల్‌లో స్కాలర్‌షిప్‌లు

**ఖలీల్‌వాడి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్‌లను ఒకే దగ్గర దరఖాస్తు చేసుకోవడానికి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ నిర్ణయం తీసుకుంది. ఇది వరకు ఉన్న ఎన్ఎస్‌పీ (నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్)ను అందుకు అనుకూలంగా మార్పు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కాకుండా వివిధ ప్రభుత్వ రంగ సంస్థల స్కాలర్‌షిప్‌ల కోసం ఇదే పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది.

**దరఖాస్తు చేసుకోవడం ఇలా..**

ముందుగా ఎన్ఎస్‌పీ పోర్టల్‌లో అభ్యర్థి వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. వచ్చిన అప్లికేషన్‌లో పూర్తి వివరాలు నమోదు చేయాలి. కుల, ఆదాయ ధ్రువపత్రాలు, విద్యార్హతలు, మెయిల్ ఐడీ, బ్యాంకు ఖాతా వివరాలను నమోదు చేసి వాటిని అప్‌లోడ్ చేయాలి. ఒకటో తరగతి నుంచి పీజీ, పీహెచ్‌డీ వరకు చదివే అన్నివర్గాల విద్యార్థులు.. ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్, ఎంఎంఎస్ఎస్, టాప్‌క్లాస్ ఎడ్యుకేషన్(ఎస్సీ, ఎస్టీలకు), యూజీసీ, ఇషాన్, ఉదయ్, సింగిల్ గర్ల్ చైల్డ్, ఏఐసీటీఈ సెంట్రల్ సెక్టార్ స్కీం ఆఫ్ స్కాలర్‌షిప్ తదితర వాటన్నింటికీ ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఈ పోర్టల్ అక్టోబర్ 31 వరకు తెరిచి ఉంటుంది.

సమాచారం..

## వరద బాధిత విద్యార్థులకు ఏబీవీపీ అండ



గుండారంలో నోట్ పుస్తకాలతో చిన్నారులు, ఏబీవీపీ నాయకులు, ఉపాధ్యాయులు

**రాజంపేట:** ఏబీవీపీ కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి వరద బాధిత ప్రాంతాలైన గుండారం, సరంపల్లి, కొండాపూర్, నాగిరెడ్డిపేట్ గ్రామాల్లో, తండాల్లోని చదివే విద్యార్థులకు గిఫ్ట్ ఏ నోట్ బుక్ కార్యక్రమం పేరుమీద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు బి.శివ పాల్గొని పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎక్కడ సమస్య వస్తే అక్కడ ఏబీవీపీ ఉంటుందని అన్నారు. ఇందూరు విభాగ్ సంఘటన కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, బాగా చదివి దేశానికి సేవ చేయాలని అన్నారు. నేతలు రంజిత్ మోహన్, గిరి, స్వామిరెడ్డి, అనిల్ రెడ్డి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## జీపీవోలు విధులను సక్రమంగా నిర్వహించాలి

- ఆర్డీవో పార్థసింహారెడ్డి



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ఆర్డీవో పార్థసింహారెడ్డి

**ఎల్లారెడ్డి:** గ్రామ పరిపాలన అధికారులు(జీపీవో) వారి విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆర్డీవో పార్థసింహారెడ్డి సూచించారు. గురువారం మీసాన్‌పల్లి రైతు వేదికలో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, గాంధారి, లింగంపేట మండలాల జీపీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. జీపీవోలు వారికి కేటాయించిన గ్రామాలలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలని, కుల, ఆదాయ, రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి పథకాలకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి గ్రామంలో విచారించిన అనంతరం ధృవీకరించాలని అన్నారు.

## మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి



నస్రుల్లాబాద్‌లో మాట్లాడుతున్న సీడీపీవో సౌభాగ్యం



బిచ్కుంద మండలం మిషన్‌కల్లాలిలో అవగాహన కల్పిస్తున్న అధికారి తహసీం

**సాక్షి నెట్‌వర్క్:** జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నేటి నుంచి నెల రోజుల పాటు పోషణ మాసం కార్యక్రమం చేపడుతున్నట్లు గురువారం ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. గర్భిణుల బరువు, ఎత్తు వివరాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంగా ఉంటాలంటే ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. బాలింతలు సైతం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం తీసుకొని తమ పిల్లలకు పెట్టాలని సూచించారు. ఆహారంలో చక్కెర, నూనెను తక్కువగా ఉపయోగించాలని అన్నారు. అవి ఎక్కువగా వాడితే జరిగే నష్టాల గురించి తెలియజేశారు.



లక్ష్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో..



అడ్లూర్ ఎల్లారెడ్డిలో ..



మద్నూర్‌లో..

## గొడవపడ్డ నలుగురికి రూ.20 వేల జరిమానా

**ఎల్లారెడ్డి:** ఇంటి విషయంలో గొడవపడిన నలుగురికి రూ.20 వేల జరిమానా విధిస్తూ ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి సుష్మ తీర్పు ఇచ్చినట్లు పోలీసులు గురువారం తెలిపారు. 2019లో నీల సిద్దిరాములు అనే వ్యక్తితో ఇంటి విషయంలో దండు నర్సింలు, దండు శివరాములు, దండు అంజయ్య, దండు గణేశ్‌ల మధ్య ఘర్షణ జరిగింది. ఘటనపై నీల సిద్దిరాములు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై మోహన్ కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా కోర్టు కానిస్టేబుల్ వినోద్ కుమార్ చాకచక్యంగా వ్యవహరించి సాక్షులను సమయానికి హాజరుపర్చారు. సాక్ష్యాలు, వాదనలు విన్న అనంతరం, న్యాయమూర్తి నిందితులు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. దీంతో నిందితులు జరిమానా మొత్తాన్ని చెల్లించారు.

### తప్పిన పెను ప్రమాదం



ఘటనాస్థలిలో ఆటో, ఆర్టీసీ బస్సు

**బోధన్:** ఎడపల్లి మండలంలోని ఎమ్మెస్సీ ఫారం వద్ద బోధన్–నిజామాబాద్ ప్రధాన రోడ్‌లో గురువారం గ్యాస్ సిలిండర్ లోడ్‌తో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడింది. ఘటనలో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆర్టీసీ బస్సును ఎడపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



## క్రైం కార్నర్

### మద్యం తాగొద్దన్నందుకు ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**ఖలీల్‌వాడి:** అతిగా మద్యం సేవించొద్దని భార్య మందలించినందుకు మనస్తాపం చెంది భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అర్సపల్లిలోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన ఎనుగందుల మహేశ్(33) నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో లేబర్‌గా పనిచేసేవాడు. కొంతకాలం నుంచి మహేశ్ మద్యానికి బానిస కావడంతో భార్య తాగుడు మానుకోవాలని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన మహేశ్ బుధవారం అర్ధరాత్రి నిజామాబాద్–జానకంపేట్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు రాకను గమనించి అడ్డుగా వెళ్లడంతో రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### కళ్యాణిలో మద్యానికి బానిసై యువకుడు..



సాయిలు (ఫైల్)

**ఎల్లారెడ్డి:** మండలంలోని కళ్యాణి గ్రామానికి చెందిన బండారి సాయిలు (42) మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎల్లారెడ్డి ఎస్సై–2 సుబ్రహ్మణ్యచారి గురువారం తెలిపారు. మద్యానికి బానిసైన సాయిలు కుటుంబంలో బుధవారం రాత్రి గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన సాయిలు గురువారం వేకువజామున బహిర్భూమికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. గ్రామ శివారులోని తన పొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

### కాకతీయ కాలువలో పడి యువకుడు..



షేక్ అస్గర్(ఫైల్)

**బాల్కొండ:** మెండోరా మండలం పోచంపాడ్‌కు చెందిన షేక్ అస్గర్(42) ప్రమాదవశాత్తు కాకతీయ కాలువలో పడి బుధవారం మృతి చెందాడు. ఎస్సై సుహాసిని తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ అస్గర్ బుధవారం సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం కాకతీయ కాలువలో దిగాడు. ప్రమాదవశాత్తు కాలువలో పడి గల్లంతయ్యాడు. గమనించిన స్థానికులు కాలువలో గాలింపుచర్యల చేపట్టగా గల్లంతైన చోటే మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం కోసం ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### కల్కి చెరువులో మహిళ మృతదేహం

**బాన్సువాడ :** పట్టణంలోని కల్కి చెరువులో గుర్తుతెలియని మహిళ (45–50) మృతదేహం గురువారం లభ్యమైంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని జాలర్ల సహాయంతో మహిళ మృతదేహాన్ని బయటికి తీశారు. మెరూన్ కలర్ చీర, ఆకుపచ్చని జాకెట్ ధరించి ఉందని, గుర్తు పట్టనంతగా మృతదేహం ఉబ్బిందని సీఐ అశోక్ తెలిపారు. వివరాలకు 8712686167ను సంప్రదించాలని సూచించారు.

### వరద కాలువలో వృద్ధురాలి మృతదేహం

- మోర్తాడ్ మండల నివాసిగా గుర్తింపు



ప్రభావతి (ఫైల్)

**మల్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని నూకపల్లి శివారు వరద కాలువలో ఓ వృద్ధురాలి మృతదేహం కొట్టుకొచ్చింది. మృతదేహం మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన ప్రభావతిగా మల్యాల పోలీసులు గుర్తించారు. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. కామణి ప్రభావతి (66) కొంతకాలంగా మతిస్థిమితం లేక బాధపడుతోంది. ఈ నెల 16న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధువులు మోర్తాడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి కుమారుడు శ్రీనివాస్ వెతుకుతున్నాడు. వరద కాలువలో శవం కొట్టుకురావడంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. శ్రీనివాస్‌ను పిలిపించగా తన తల్లిగా గుర్తించాడు. కేసు నమోదు చేసినట్లు మల్యాల పోలీసులు తెలిపారు.

### మిలిటరీ మద్యం అమ్మొద్దు.. కొనొద్దు



**మాచారెడ్డి:** మిలిటరీ మద్యాన్ని అమ్మినా, కొనుగోలు చేసినా నేరమేనని కామారెడ్డి ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ అన్నారు. గురువారం పాల్వంచ మండలం ఆరేపల్లిలో ఒకరి ఇంట్లో నిల్వ చేసిన మిలిటరీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మద్యం నిల్వ చేసిన సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. ఈ దాడిలో ఎస్సైలు విక్రమ్, శ్రీనివాస రావు, సిబ్బంది పాషా, మైస రాజు, దేవా కుమార్ పాల్గొన్నారు.